సాక్షి
అనంతపురం
సోమవారం ¦ 13 ¦ మార్చి ¦ 2023



చదువులకూ ఓ బ్యాంక్

అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్ (ఏబీసీ) విద్యార్థుల భవితకు దన్నుగా నిలవనుంది. రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరుగుతోంది. 8లో



టమాట కిలో రూ.20

కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్టంగా రూ.20 పలికింది. 250 టన్నుల కాయలు వచ్చాయి.

గరిష్టం/కనిష్టం
37.4°/13.2°

జిల్లా అంతటా ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చాలా మండలాల్లో చలి వాతావరణం కొనసాగింది. కొన్ని మండలాల్లో గాలివేగం బాగా పెరిగింది.

న్యూస్‌రీల్

ల్యాండ్ సర్వేయర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ



అనంతపురం: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ల్యాండ్ సర్వేయర్, ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్ అండ్ శానిటేషన్ కోర్సుల్లో అనంతపురం, గుంతకల్లు స్కిల్ హబ్‌ల్లో ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు స్కిల్ హబ్ సెంటర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఏ. గోవింద రాజులు తెలిపారు. 3 నెలల పాటు శిక్షణ ఉంటుందని, అనంతరం నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ సర్టిఫికెట్‌ను అందజేస్తూ ప్రముఖ ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగం కల్పిస్తామన్నారు. 20 శాతం థియరీ, 80 శాతం ప్రాక్టికల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, జాబ్ స్కిల్స్ నేర్పిస్తామన్నారు. మార్చి 20 లోపు ఆధార్ జిరాక్స్, రేషన్ కార్డు జిరాక్స్, అర్హత ధ్రువపత్రాలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో సంప్రదించాలని సూచించారు. వివరాలకు 9908620306, 9032345188 నంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చు.

'ఐక్యూఏసీ' తోడ్పాటుకు ప్రొఫెసర్ల కమిటీ

అనంతపురం: ఎస్కేయూ న్యాక్ గుర్తింపునకు దరఖాస్తు చేసిన నేపథ్యంలో వర్సిటీ ఐక్యూఏసీ (ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్- అంతర్గత నాణ్యత ప్రమాణాల మదింపు కమిటీ) పనితీరు మెరుగుపరచడానికి వీలుగా ప్రొఫెసర్ల కమిటీని నియమించారు. వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ కే.రాంగోపాల్ (ఫిజిక్స్),అడిషనల్ డైరెక్టర్ ఐక్యూఏసీ, డాక్టర్ వి. మాధవి (ఇంగ్లిష్) డిప్యూటీ డైరెక్టర్-ఐక్యూఏసీ, డాక్టర్ పి. తిమ్మయ్య (ఎలక్ట్రానిక్స్) డిప్యూటీ డైరెక్టర్, డాక్టర్ డి. చంద్రమౌళి రెడ్డి (పొలిటికల్ సైన్సెస్) డిప్యూటీ డైరెక్టర్, డాక్టర్ సీహెచ్ కృష్ణుడు (ఎంబీఏ) డిప్యూటీ డైరెక్టర్ , డాక్టర్ బి. జెస్సీ (ఫిజికల్ ఎడ్యుకేషన్) డిప్యూటీ డైరెక్టర్, సంధ్యారాణి (బోటనీ) కమిటీలో ఉన్నారు. వీరితో పాటు సెరికల్చర్ విభాగం టీచింగ్ అసిస్టెంట్ డాక్టర్ పి. లక్ష్మీనారాయణ రెడ్డి, సోషల్ వర్క్ విభాగం టీచింగ్ అసిస్టెంట్ డాక్టర్ డి. శ్రీనివాస రెడ్డి అక్రిడిటేషన్ ప్రక్రియలో పాల్గొనాలని ఆదేశాలు జారీ చేశారు.

ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి అనిల్‌పై కేసు నమోదు

తాడిపత్రి అర్బన్: ఆన్‌లైన్ ద్వారా ఓటర్ల ఖాతాలోకి నగదు బదిలీ చేసినందుకు పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి చామల వెంకటఅనిల్‌కుమార్‌రెడ్డితో పాటు మరో 17 మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 10న తాడిపత్రి పోలీస్ స్టేషన్ సమీపంలోని ఎస్‌బీఐ కస్టమర్ సర్వీస్ పాయింట్ (సీఎస్‌పీ) నుంచి దాదాపు 28 మంది ఉపాధ్యాయుల ఖాతాల్లోకి ఆన్‌లైన్ ద్వారా నగదు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో సీఎస్‌పీ నిర్వాహకుడు శివశంకర్‌రెడ్డితో పాటు ప్రధానోపాధ్యాయుడు సాంబశివారెడ్డి, యల్లనూరుకు చెందిన పోస్ట్‌మెన్ నగేష్‌ని అరెస్టు చేసిన పోలీసులు తాజాగా ఎమ్మెల్సీ అభ్యర్థి చామల వెంకటఅనిల్‌కుమార్‌రెడ్డితో పాటు మరో 17 మందిపై కేసు నమోదు చేశారు.

ఓటేద్దాం రండి..



జేఎన్‌టీయూలో పోలింగ్ సామగ్రి పంపిణీ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

నేడే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

- ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఓట్ల పండగ
- కేంద్రాలకు తరలిన సామగ్రి
- కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిన యంత్రాంగం

జిల్లాలో పట్టభద్ర ఓటర్లు	68,341
ఉపాధ్యాయ ఓటర్లు	5,564
పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలు	84
ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రాలు	33

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ (ఉమ్మడి అనంతపురం, వైఎస్సార్, కర్నూలు జిల్లాలు) పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లా యంత్రాగం సర్వం సిద్ధం చేసింది. సోమవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ సాగనుంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 49 మంది, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 12 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. జిల్లాలో పట్టభద్ర ఓటర్లు 68,341, ఉపాధ్యాయ ఓటర్లు 5,564 మంది ఉన్నారు. ఈ క్రమంలో పట్టభద్రులకు 84 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయులకు 33 పోలింగ్ కేంద్రాలు మొత్తం 117 కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ నిర్వహణకు 117 మంది ప్రిసైడింగ్ అధికారులు (పీఓ), 117 మంది పీఓ-1, 117 మంది ఓపీఓ-1, 117 మంది ఓపీఓ-2 మొత్తం 445 మందిని నియమించారు. వీరు కాకుండా 101 మందిని రిజర్వులో ఉంచారు.

రూట్ అధికారులదే బాధ్యత

ఎన్నికలకు సంబంధించి 117 పోలింగ్ కేంద్రాలను 16 సెక్టార్లుగా విభజించారు. ఒక్కొక్క సెక్టార్‌కు డివిజన్ స్థాయి అధికారి సెక్టోరియల్ అధికారిగా వ్యవహరిస్తారు. అదే విధంగా ఒక్కొక్క సెక్టార్‌కు మండల సర్వేయర్ రూట్ అధికారిగా వ్యవహరిస్తారు. రూట్ అధికారులు తమకు కేటాయించిన రూట్‌లోని పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది, సామగ్రిని తరలించడం, పోలింగ్ పూర్తైన తరువాత సిబ్బందిని, సామగ్రిని తిరిగి జేఎన్‌టీయూ కళాశాలకు చేరుస్తారు. పోలింగ్ సామగ్రి పంపిణీ ప్రక్రియను ఆదివారం జేఎన్‌టీయూ కళాశాలలో నిర్వహించారు.

సెల్‌ఫోన్ నో ఎంట్రీ..

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుంది. సాయంత్రం 4 గంటలకు ముగుస్తుంది. ఆ తర్వాత కేంద్రంలోకి ఓటర్లను అనుమతించరు. అయితే, అప్పటికే కేంద్రంలోకి చేరుకుని వరుసలో నిలుచున్న వారికి టోకన్లు ఇచ్చి ఓటు వేసేందుకు అనుమతిస్తారు. కేంద్రాల్లోకి సెల్ ఫోన్ అనుమతించరు. ఓటరు తన ఓటరు స్లిప్‌తో పాటు, ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్ కార్డు) చూపించాలి. ఎపిక్ కార్డు లేని వారు ఓటరు స్లిప్‌తో పాటు తమ ఆధార్, పాన్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్ట్, బ్యాంక్ ఖాతా పుస్తకం, డిగ్రీ, డిప్లొమో ఒరిజినల్ సర్టిఫికెట్ వీటిలో ఏదైనా ఒకటి చూపించి ఓటు వేయవచ్చు.

గుర్తింపు కార్డు తప్పనిసరి

- ఆర్‌ఓ, కలెక్టర్ నాగలక్ష్మి

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయాలంటే ఓటరు స్లిప్‌తో పాటు ఫొటో గుర్తింపు కార్డు తప్పనిసరి అని ఆర్‌ఓ, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి స్పష్టం చేశారు. గుర్తింపు కార్డు చూపకపోతే ఓటు వేసేందుకు అవకాశం ఇవ్వవద్దని పోలింగ్ సిబ్బందికి సూచించారు. జేఎన్‌టీయూ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఆదివారం ఆమె సందర్శించారు. పోలింగ్ సామగ్రి, పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సోమవారం ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభించాలని చెప్పారు. ఎన్నికల కమిషన్ సూచించిన ఫొటో గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకదానిని ఓటరు తన ఓటరు స్లిప్‌తో పాటు చూపిస్తేనే ఓటు వేసేందుకు అవకాశం కల్పించాలని చెప్పారు. సాయంత్రం 4 గంటల్లోపు పోలింగ్ కేంద్రానికి చేరుకున్న వారికి ఓటు వేసేందుకు అనుమతించాలని చెప్పారు. పట్టభద్ర ఓటర్ల పోలింగ్ నిర్ణీత వ్యవధిలో పూర్తి చేసేందుకు ప్రతి పోలింగ్ కేంద్రంలో రెండు కంపార్ట్‌మెంట్‌లు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాను 16 సెక్టార్లుగా విభజించి 16 రూట్లలో పట్టభద్రుల ఎమ్మెల్సీకి 84 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 33 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. సమస్యాత్మకంగా గుర్తించిన 61 పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు పోలీసు బలగాలను అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ గాయత్రిదేవి, ఆర్డీఓ మధుసూదన్, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, మెప్మా పీడీ విజయలక్ష్మి, జిల్లా పర్యాటక అధికారి నాగేశ్వరెడ్డి, జిల్లా పరిశ్రమల అధికారి నాగరాజరావు, తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల సామగ్రి సరిచూసుకుంటున్న సిబ్బంది



కేటాయించిన ప్రాంతాలకు బయలుదేరుతున్న సిబ్బంది



సామగ్రిని బస్సుల్లో ఉంచేందుకు తీసుకెళ్తున్న దృశ్యం

'అంకె'లోనే వేయాలి



ఓటు వేసే విధానం తెలియజేస్తూ ఎన్నికల కమిషన్ జారీ చేసిన పోస్టర్

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలు బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఉంటాయి. పోటీ చేస్తున్న అభ్యర్థులకు గుర్తులు ఉండవు. వారి పేర్లు ఉంటాయి. పేర్లకు ఎదురుగా ఉన్న గడిలో 'అంకె'లోనే ఓటు వేయాలి. అలా కాకుండా అక్షరాలు, టిక్‌లు, ముద్రలు వేస్తే చెల్లదు. ప్రాధాన్యత క్రమంలో అభ్యర్థులందరికీ ఓటు వేయవచ్చు. లేదా మొదటి ప్రాధాన్యత ఓటు ఒక్కటే అయినా వేయవచ్చు. అయితే మొదటి ప్రాధాన్యత ఓటు వేయకుండా... ఆ తరువాతి ప్రాధాన్యత ఓట్లు వేస్తే చెల్లదు. కాబట్టి ఓటరు తాను నిర్ణయించుకున్న వ్యక్తికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసిన తరువాత మిగిలిన అభ్యర్థులకు పాధాన్యత ఓటు వేయవచ్చు.

- ఎన్నికల యంత్రాగం అందుబాటులో ఉంచిన వంగపూత (వైలెట్) రంగు స్కెచ్ పెన్‌తోనే వేయాలి. ఇతర పెన్నులతో వేయకూడదు.
- అభ్యర్థి పేరు ఎదురుగా ఉన్న గడిలో నంబర్ వేయాలి.
- ప్రాధాన్యత నంబర్‌ను అభ్యర్థి పేరుకు ఎదురుగా ఉన్న గడిల్లో నంబరింగ్ ఇవ్వవచ్చు.
- అభ్యర్థి ఎదురుగా ఉన్న గడిలో ఇంగ్లిష్ అంకెలు 1, 2, 3.... ఇలా , లేదా రోమన్ అంకెలు వేయవచ్చు.

ఇలా వేస్తే చెల్లదు...

- ఒకే అంకె ఇద్దరు అభ్యర్థులకు వేయకూడదు.
- ఒక అభ్యర్థికి ప్రాధాన్యత ఓటు అంకెలో వేసి మరొకరికి ముద్ర వేయకూడదు.
- ప్రాధాన్యత ఓటు అంకెల్లో కాకుండా అక్షరాల్లో రాయకూడదు.
- అభ్యర్థి ఎదురుగా గడిలో అంకె బదులుగా రైట్, ఇంటూ, ఇలా ఏ టిక్కు వేయకూడదు.
- ఒక అభ్యర్థికి రెండు ప్రాధాన్యత ఓట్లు వేయకూడదు.
- ఓటు అభ్యర్థి పేరు ఎదురుగా ఉన గడిలోనే వేయాలి. రెండు గడుల్లో సగం సగం వచ్చేలా వేయరాదు.

పోలింగ్‌కు పటిష్ట బందోబస్తు

పోలీసు బందోబస్తు ఇలా..	
మొత్తం సిబ్బంది	1,200
రూట్ మొబైళ్లు	36
అదనపు ఎస్పీలు	2
డీఎస్పీలు	04
సీఐలు	22,
ఎస్సైలు	49,
ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు	217
కానిస్టేబుళ్లు	765
హోంగార్డులు	117
ఏపీఎస్‌పీ బెటాలియన్లు	3
స్ట్రైకింగ్ ఫోర్స్	34
స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్	16
ఫ్లయింగ్ స్క్వాడ్	08,
ఎంసీసీ బృందాలు	37,
స్టాటిక్ సర్వేలెన్స్ బృందాలు	35,
క్యూఆర్టీ	04
పికెట్స్	25



పోలీసు సిబ్బందికి సూచనలిస్తున్న అధికారి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా సాగేలా పటిష్ట బందోబస్తు చేపట్టినట్లు ఎస్పీ ఫక్కీరప్ప తెలిపారు. బందోబస్తుకు వెళ్లే అధికారులు, సిబ్బందిని ఉద్దేశించి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సిబ్బందికి డీఎస్పీలు దిశానిర్దేశం చేయాలన్నారు. ''పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన సిబ్బంది ఇతర శాఖల సిబ్బందితో పాటు పోలింగ్ స్టేషన్ వద్దనే ఉండాలి. రాజకీయ నాయకుల బిల్డింగ్స్, స్థలాల్లో వసతి కల్పించరాదు. సామగ్రిని భద్రంగా చూసుకోవాలి. ఉదయం 5.30 గంటలకల్లా విధుల్లో ఉండాలి. ఉన్న చోటుకే టిఫిన్, మధ్యాహ్న భోజనం సరఫరా అవుతుంది. పోలింగ్ స్టేషన్ పరిసరాల్లో మండే స్వభావం ఉన్న పదార్థాలు, వస్తువులు లేకుండా చూసుకోవాలి. పోలింగ్ స్టేషన్‌కు 100, 200 మీటర్ల పరిధి హద్దులు ఏర్పాటు చేసుకోవాలి. హద్దుకు లోపల ఎలాంటి చీటీలు, గుర్తులు ఉండకూడదు. ప్రచారం చేయరాదు. అర్హత ఉన్న పోలింగ్ ఏజెంట్లను మాత్రమే లోపలికి పంపాలి. గన్ మేన్లను లోపలికి పంపరాదు. పోలీసులూ వెళ్లకూడదు. ప్రిసైడింగ్ ఆఫీసర్ మినహా పోలింగ్ స్టేషన్ లోపలికి అనుమతి లేని వ్యక్తులను పంపరాదు. పోలింగ్ కేంద్రం వద్ద ఎవర్నీ కుర్చోనివ్వరాదు, తిరగనివ్వరాదు. పోలింగ్ బూత్ వద్ద రౌడీషీటర్లు, ట్రబుల్ మంగర్స్ తచ్చాడుతుంటే హెచ్చరించి పంపించేయాలి. బందోబస్తులో ప్రిసైడింగ్ అధికారి ఉత్తర్వుల మేరకు నడచుకోవాలి. పోలింగ్ రోజు 100 మీటర్ల పరిధిలో ఎలాంటి గుంపులు, సమూహాలు ఉండకూడదు.'' అని ఎస్పీ పేర్కొన్నారు.

స్వీయ పరివర్తనతోనే పరిపూర్ణత

ప్రశాంతి నిలయం: మనిషి సద్గుణాలను కలిగి జీవన మార్గంలో స్వీయ పరివర్తన పొందడం ద్వారా పరిపూర్ణులవుతారని సత్యసాయి సేవా సంస్థల దేశీయ అధ్యక్షుడు నిమిష్ పాండ్య తెలిపారు. సత్యసాయి విద్యాసంస్థల ఆధ్వర్యంలో జరుగుతున్న మూడు రోజులు జాతీయ లీడర్ షిప్ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిమిష్ పాండ్యా మాట్లాడుతూ లీడర్ షిప్ కోర్సులో పొందిన జ్ఞానాన్ని, నేర్చుకున్న అంశాలను నిత్య జీవితంగా సాధన చేయాలన్నారు. సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె రత్నాకర్‌రాజు తదితరులున్నారు.

మళ్లీ విజయఢంకా మోగిద్దాం

- మంత్రి ఉషశ్రీచరణ్ పిలుపు
- ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం



వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించిన పార్టీ అధ్యక్షుడు పైలా, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ప్రజాప్రతినిధులు



పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

అనంతపురం క్రైం: రానున్న ఎన్నికల్లో మళ్లీ విజయ ఢంకా మోగించేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేద్దామని మంత్రి ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. కళ్యాణదుర్గంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉషశ్రీ చరణ్ పార్టీ జెండా ఆవిష్కరించిన అనంతరం కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పార్టీ బలోపేతంలో కార్యకర్తల కృషి మరువలేనిదన్నారు.

- అనంతపురం జిల్లా పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పార్టీ జెండా ఆవిష్కరించారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డితో కలసి వైఎస్ రాజశేఖర రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మూడున్నరేళ్లలోనే విద్య, వైద్య రంగాల్లో సమూల మార్పులు తీసుకొచ్చారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సామాజిక న్యాయం సాధ్యపడిందన్నారు. వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటామని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పేర్కొన్నారు.
- రాయదుర్గం వినాయక సర్కిల్‌లో నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి కేక్ కట్ చేశారు. సీఎం వైఎస్ జగన్‌కు ప్రతి ఒక్కరూ అండగా నిలుద్దామని పిలుపునిచ్చారు. అనంతరం రాయదుర్గం ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.
- గుంతకల్లులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి పార్టీ జెండా ఆవిష్కరించారు. గుత్తిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రామలింగప్ప ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు.
- తాడిపత్రి పార్టీ కార్యాలయంలో యువ నాయకులు హర్షవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా జై జగన్.. జై వైఎస్సార్ నినాదాలు మార్మోగాయి.
- రాష్ట్రంలో అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ చర్యలు తీసుకున్నారని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రెడ్డి కొనియాడారు. ఉరవకొండలోని పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన జెండా ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహ్మద్, విశ్రాంత జడ్జి, బీసీ కమిషన్ సభ్యులు కిష్టప్ప, రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్ హరిత, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, అనుబంధ జోనల్ ఇన్‌చార్జ్‌లు రమేష్‌గౌడ్, రిలాక్స్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీసీలిప్పుడు గుర్తొచ్చారా పవన్?

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య ధ్వజం



అనంతపురం క్రైం: జనసేన పార్టీ ఏర్పాటైన ఈ పదేళ్లలో ఏనాడూ బీసీల గురించి మాట్లాడని రాజకీయ అజ్ఞాని పవన్‌కళ్యాణ్‌కు ఉన్నఫళంగా ఇప్పుడు బీసీలు గుర్తుకు రావడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అన్నారు. ఆదివారం అనంతపురంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల ఆత్మగౌరవాన్ని చంద్రబాబు పాదాల వద్ద తాకట్టు పెట్టాలని పవన్ కళ్యాణ్ చూస్తున్నాడని మండిపడ్డారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాతనే బీసీలు ఒక్కసారిగా వెలుగులోకి వచ్చారన్నారు. అన్ని విధాలుగా బీసీల అభ్యున్నతికి పాటుపడింది సీఎం వైఎస్ జగన్ ఒక్కరేనని గుర్తు చేశారు. సామాజికంగా, రాజకీయంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సముచిత స్థానం కల్పించారన్నారు. బీసీ అధ్యయన కమిటీని ఏర్పాటు చేసి బీసీల సమస్యలకు పరిష్కారం చూపిన గొప్ప వ్యక్తిగా సీఎం వైఎస్ జగన్ చరిత్ర సృష్టించారన్నారు. దీంతో బీసీలను ఆకర్షించేందుకు చౌకబారు రాజకీయాలకు పవన్ తెరలేపడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు కనుసన్నల్లో నడుస్తూ బీసీలను వంచనకు గురి చేసే పవన్‌కళ్యాణ్ ఎత్తుగడలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు.

రారండోయ్ తేరును చూద్దాం

అందరూ వేయి కళ్లతో ఎదురు చూస్తున్న కదిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మ రథోత్సవం రానే వచ్చింది. సోమవారం ఉదయం రథానికి పూజలు నిర్వహించి తేరును లాగనున్నారు. లక్షలాదిగా తరలిరానున్న భక్తజన సందోహం మధ్య నారసింహుడి బ్రహ్మరథోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఇప్పటికే అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

- నేడు లక్ష్మీ నారసింహుడి బ్రహ్మ రథోత్సవం
- దేశంలో మూడవది. తెలుగు రాష్ట్రాల్లో పెద్ద రథం
- లక్షలాది మంది భక్తులు పాల్గొంటారని అంచనా



రథాన్ని సిద్ధం చేస్తున్న సిబ్బంది



భక్తులతో నిండిపోయిన ఆలయ ప్రాంగణం

కదిరి: నారసింహుని బ్రహ్మ రథోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం ఉదయం 7 నుంచి 7.45 గంటల మధ్య అనురాధా నక్షత్రంలో శుభ మీన లగ్న పుష్కరాంశంలో తేరు ప్రారంభించేందుకు ఆలయ అర్చక పండితులు శుభ సమయంగా నిర్ణయించారు. బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రాధాన్యత కలిగిన ఉత్సవం ఇది. ఇప్పటికే ఆలయ ప్రాంగణంతో పాటు తిరు వీధుల గుండా ఉన్న భవనాలు సైతం భక్తులతో కిట కిటలాడి పోతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో నారసింహుడు తిరు వీధుల్లో విహరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించడానికి దేవతలు తమ వాహనాలను పంపుతారని భక్తుల నమ్మకం. సాక్షాత్తూ బ్రహ్మదేవుడే శ్రీవారి రథోత్సవం నాడు రథాన్ని నడిపి స్వామి వారు విహరించడానికి సహకరిస్తారని, అందుకే బ్రహ్మ రథోత్సవం అంటారని ప్రధాన ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు తెలిపారు.

దేశంలోనే మూడవ పెద్ద రథం..

తమిళనాడు అండాల్ అమ్మవారి శ్రీవల్లి పుత్తూరు రథం, తంజావూర్ జిల్లాలోని తిరువార్ రథం తర్వాత దేశంలో అతి పెద్ద రథంగా కదిరి తేరు ప్రసిద్ధి చెందింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోకెల్లా అతిపెద్ద బ్రహ్మ రథం ఇదే. ఈ రథం సుమారు 540 టన్నుల బరువు, 37.5 అడుగుల ఎత్తు ఉంది. రథంలోని పీఠం వెడల్పు 16 అడుగులు. 120 ఏళ్ల క్రితం తయారు చేసిన రథం చక్రాలు ఒక అడుగు, ఒక అంగుళం వెడల్పుతో పాటు 8 అడుగుల డయామీటర్‌తో ఉన్నాయి. రథంపై సుమారు 256 శిల్ప కళాకృతులను టేకుతో అందంగా చెక్కారు. వివిధ భంగిమల్లో చెక్కిన ఈ బొమ్మలు అప్పటి శిల్ప కళా నైపుణ్యానికి నిదర్శనం. రథ చక్రాలకు రెండేళ్ల క్రితం తాత్కాలిక మరమ్మతులు చేశారు.

3 లక్షల మందికిపైగా భక్తులు..

ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా నారసింహుడు బ్రహ్మరథోత్సవానికి భక్తులు లక్షలాదిగా తరలిరానున్నారు. 3 లక్షల మందికి పైగా భక్తులు రథోత్సవంలో పాల్గొంటారని పోలీసు వర్గాలు అంచనా వేస్తున్నాయి. భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా నీటి సౌకర్యంతో పాటు దాతల సహకారంతో అడుగడుగునా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

పటిష్ట బందోబస్తు

పుట్టపర్తి అర్బన్: కదిరి పట్టణంలో సోమవారం జరగనున్న ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి రథోత్సవానికి పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ పేర్కొన్నారు. రథోత్సవానికి ముగ్గురు డీఎస్పీలు, 10 మంది సీఐలు, 15 మంది ఎస్‌ఐలు, 210 మంది సివిల్ కానిస్టేబుళ్లు, 90 మంది ఏఆర్ కానిస్టేబుళ్లు, 100 మంది హోంగార్డులు, ఏపీఎస్పీ ఒక ప్లటూన్ (26 మంది)ను నియమించామన్నారు. ఇదే రోజున ఎమ్మెల్సీ ఎన్నికలు పట్టణంలో జరుగుతున్నాయి కాబట్టి భక్తులందరూ పోలీసులకు సహకరించాలని కోరారు. ప్రశాంత వాతావరణంలో కార్యక్రమాలు ముగిసేలా చూడాలన్నారు. – జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్

ఐరావతంపై వసంత వల్లభుడు

- భక్తులతో కిటకిటలాడిన ఖాద్రీ ఆలయం



ఐరావతంపై నృసింహుడి దర్శనం

కదిరి: వసంత వల్లభుడిగా పేరు గాంచిన ఖాద్రీ లక్ష్మీ నారసింహుడు బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి ఐరావతం (గజవాహనం)పై దర్శనమిచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగునున్న కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి సైతం పెద్ద సంఖ్యలో భక్తాదులు నృసింహుని దర్శనం కోసం తరలివచ్చారు. హిరణ్య కశ్యపుని సంహరించిన తర్వాత నారసింహుడి ఉగ్ర రూపాన్ని చూడలేని దేవతాగణం మరోసారి యథారూపంలో ప్రసన్నం కావాలని కోరుతారు. దీంతో స్వామి వారు అనుగ్రహించి వారి కోరిక మేరకు ఐరావతంపై దర్శనమిస్తారని భక్తుల నమ్మకం. ఆలయ అర్చకులు తొలుత యాగశాలలో నిత్య హోమాలు నిర్వహించి రథ కలశ పూజలు చేసిన తర్వాత శ్రీవారి బ్రహ్మ రథంపై ప్రతిష్ఠించారు. శ్రీవారికి నిత్య కైంకర్య సేవలు నిర్వహించిన అనంతరం బ్రహ్మరథం వద్ద శుద్ధ పుణ్య హవచనం, వాస్తుహోమం, రథాంగ హోమం, రథ సంప్రోక్షణ చేశారు. ఐరావతంపై ఊరేగిన అనంతరం శ్రీవారు తిరిగి ఆలయంలోకి వెళ్లి పూజలనంతరం తెల్లవారుజామున రథంపైకి ప్రవేశించారు. శ్రీదేవి, భూదేవిలను కంకణ భట్టాచార్యులు రథంపైకి తీసుకొచ్చారు.

వైభవంగా భూతప్పల ఉత్సవం

- భూతప్పల స్పర్శతో పులకించిన భక్తజనం



భక్తులపై కాలు మోపుతూ వస్తున్న భూతప్ప

రొళ్ల: లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రొళ్లలో ఆదివారం భూతప్పల ఉత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఉమ్మడి అనంతపురం జిల్లా నలుమూల నుంచే కాక కర్ణాటక, తమిళనాడులోని వివిధ జిల్లాల నుంచి శనివారం సాయంత్రమే వేల సంఖ్యలో భక్తులు ఆలయం వద్దకు చేరుకున్నారు. ఈరముద్దమ్మదేవి ఆలయం వద్ద నుంచి దేవాలయం ఆవరణ వరకు రోడ్డుపై కిలో మీటర్ల మేర భూతప్పల రాక కోసం భక్తులు బోర్లా పడుకున్నారు. తొలుత మారుతీ కాలనీ సమీపంలోని ముత్తరాయస్వామి దేవాలయంలో భూతప్పలు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తడి బట్టలతో బోర్లాపడుకున్న భక్తులపై భూతప్పలు నాట్యమాడుతూ ముందుకు సాగారు. భూతప్పల కాలి స్పర్శతో రోగాలు నయమవుతాయని, సంతానం భాగ్యం లేని మహిళలకు సంతానం కలుగుతుందని, పెళ్లి కాని యువతులకు పెళ్లిళ్లు జరుగుతాయని భక్తుల విశ్వాసం. అనంతరం లక్ష్మీనరసింహస్వామి, సమీపాన ఉన్న ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి భూతప్పలు చేరుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. తర్వాత లక్ష్మీనరసింహస్వామి ఆలయం సమీపంలో వెలసిన భూతప్ప దేవాలయం వద్దకు చేరుకుని ఆలయంలో పట్టం కూర్చోబెట్టారు. సీఐ సురేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

నేడు ప్రసాద వితరణ..

రొళ్ల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం భక్తులు సమర్పించిన వడి బియ్యం, బెల్లం తదితర వాటితో 101 ప్రసాదాన్ని తయారు చేసి భూతప్ప ఆలయం ముందు ఉంచి పూజలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రతిపక్షాలకు ఆత్మవిశ్వాసం లోపించింది

- వారి అభ్యర్థులపై వారికే నమ్మకం లేదు
- ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి

అనంతపురం క్రైం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతిపక్షాలైన టీడీపీ, పీడీఎఫ్‌లు గెలుపుపై ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయి ఓట్ల మార్పిడికి సిద్ధపడ్డాయని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి విమర్శించారు. వారి అభ్యర్థులపై వారికి నమ్మకం లేకుండా పోయిందన్నారు. దీంతో మీకు మేము.. మాకు మీరు అంటూ ఒకరికి ఒకరు ఓటు వేసుకునేలా ఒప్పందాలు చేసుకున్నారన్నారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ, పీడీఎఫ్ ఒప్పందాలను బహిర్గతం చేస్తూ.. అనైతిక చర్యను వ్యతిరేకించాలని యువతకు, మేధావులకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రకటించగానే ఒంటరి పోరుకు సిద్ధమన్న టీడీపీ.. తీరా పోలింగ్‌కు ముందు రోజు ఓటమి భయంతో కుట్ర రాజకీయాలకు తెరలేపడం సిగ్గుచేటన్నారు. ఇన్నాళ్లూ ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందని చెప్పిన వారే ఇప్పుడు ఎలాగైనా వైఎస్సార్‌సీపీని ఓడించేందుకు ఓట్ల మార్పిడి విధానానికి తెరతీశారన్నారు. చివరకు ఎవరికి వారు వాళ్ల అభ్యర్థులనే మోసం చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంపై ప్రజల్లో విశ్వాసం ఉందని, ఎవరెన్ని కుట్రలు చేసిన వైఎస్సార్‌సీపీ మద్దతుదారులదే అంతిమ విజయమవుతుందని పేర్కొన్నారు.

చదువులకూ ఓ బ్యాంక్!

- ఏబీసీతో భవితకు దన్ను
- ఆన్‌లైన్ విధానంలో అందుబాటులోకి
- ఎప్పుడైనా... ఎక్కడి నుంచైనా కోర్సు పూర్తి చేసే అవకాశం
- జేఎన్‌టీయూ–అనంతపురం పరిధిలో ఇప్పటి వరకూ 20 వేల మంది విద్యార్థుల రిజిస్ట్రేషన్





అనంతపురం: నగదు లావాదేవీలకు సంబంధించి ఇప్పటి వరకూ బ్యాంకులు, ఖాతాలు ఉన్నట్లే.. చదువులకూ ఓ బ్యాంక్ ఏర్పాటైంది. అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్ (ఏబీసీ) పేరుతో ఏర్పాటైన ఈ బ్యాంక్ ఖాతాలు.. విద్యార్థి ఎన్ని కోర్సులు పూర్తి చేశాడో లెక్కించేందుకు దోహదపడతాయి. ఈ నేపథ్యంలో ఏబీసీ బ్యాంక్ ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ఈ ఖాతాలో నమోదు చేసిన వివరాలు అత్యంత ప్రామాణికంగాను, పారదర్శకంగాను ఉండడంతో పాటు ప్రపంచంలోని ఏ మూల నుంచైనా ఈ ఖాతాను పరిశీలించి, అభ్యర్థి ప్రతిభను అంచనా వేయవచ్చు. బహుళ జాతి సంస్థ (మల్టీ నేషనల్ కంపెనీ)ల్లో కొలువు దక్కించుకోవాలనుకునే అభ్యర్థికి సంబంధించిన హార్డ్ కాపీలను కాకుండా ఏబీసీ ఖాతాను పరిశీలిస్తే చాలు.. అతని నైపుణ్యం, ప్రతిభ, అర్హత తదితర అంశాలు ఇట్టే తెలిసిపోతాయి. విప్లవాత్మక ఒరవడితో సాగుతున్న ఏబీసీ బ్యాంక్‌లో ప్రతి విద్యార్థి ఖాతాను తెరిచేలా జేఎన్‌టీయూ–అనంతపురం ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు.

విద్యార్థి ప్రతిభకు తార్కాణమే ఏబీసీ..

నాణ్యమైన బోధన – అభ్యసనా ప్రక్రియను మెరుగుపరచడంలో భాగంగా యూజీసీ (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్)–2021 మార్గదర్శకాలకు అనుగుణంగా 'ఏబీసీ'ని ఏర్పాటు చేశారు. పరిశ్రమల ఆధారిత సిలబస్‌ను విద్యార్థులు అభ్యసించేందుకు వీలుగా ఈ విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చారు. కోర్సు చదువుతున్న సమయంలోనే విద్యార్థులు పరిశ్రమలకు వెళ్లి క్షేత్ర స్థాయిలో అనుభవం గడించిన అనంతరం తిరిగి కోర్సులోకి ప్రవేశించవచ్చు. పరిశ్రమలో పనిచేసే సమయంలో ఆన్‌లైన్ విధానంలో పాఠ్యాంశాల అభ్యసనకు ఏబీసీ దోహదపడుతుంది. అయితే ఇందుకు ముందుగా విద్యార్థి.. ఏబీసీలో తన ఖాతాను ప్రారంభించాల్సి ఉంటుంది. తప్పనిసరిగా ధ్రువీకరణ పొందిన కంపెనీల్లోనే పనిచేస్తూ ఆన్‌లైన్ ద్వారా కోర్సు పూర్తి చేయవచ్చు. ఈ తరహా విద్యాభ్యాసానికి 40 క్రెడిట్లను పరిగణనలోకి తీసుకుంటారు. ఉదాహరణకు బీటెక్‌లో మొత్తం 163 క్రెడిట్లు ఉండగా.. ఇందులో 40 శాతం క్రెడిట్లను ఏబీసీలో నమోదైన ఆన్‌లైన్ విధానం ద్వారా పూర్తి చేయవచ్చు. ఎంటెక్‌లో మొత్తం 95 క్రెడిట్‌లు ఉండగా 40 శాతం ఆన్‌లైన్ విధానంలో పూర్తి చేసే వెసులుబాటు ఉంది. ఇప్పటి వరకూ ఎన్‌పీటీఎల్, స్వయం, వీ–ల్యాబ్ ప్లాట్‌ఫాంలో ఆన్‌లైన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న 20 వేల మంది..

జేఎన్‌టీయూ–అనంతపురం పరిధిలో మొత్తం 42 ఇంజినీరింగ్ కళాశాలల్లో ఇప్పటి వరకూ 20 వేల మంది విద్యార్థులు ఏబీసీ రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ప్రతి విద్యార్థికి అకడమిక్ బ్యాంక్ అకౌంట్‌ను వర్సిటీ అధికారులు అందజేస్తున్నారు. యూనిక్ ఐడీ, పాస్‌వర్డ్ సాయంతో ఏబీసీ ఖాతాలోకి ప్రవేశించవచ్చు. ఆన్‌లైన్‌లో విద్యార్థి అభ్యసిస్తున్న కోర్సుకు సంబంధించి ఎప్పటికప్పుడు క్రెడిట్లు లెక్కిస్తుంటారు. ఈ క్రెడిట్లు తొమ్మిదేళ్ల పాటు చెల్లుబాటులో ఉంటాయి. ఆ తర్వాత పాత కోర్సులు రద్దవుతాయి. క్రెడిట్లు కావాలనుకునే అభ్యర్థులు తిరిగి కొత్త కోర్సులు అభ్యసించాల్సి ఉంటుంది. ఈ అంశంపై జేఎన్‌టీయూ–అనంతపురం విద్యార్థులను ఎవాల్యుయేషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఈ. కేశవరెడ్డి చైతన్య పరుస్తూ ఏబీసీ ఖాతాలు తెరిచేలా చర్యలు తీసుకుంటున్నారు. మొత్తం వర్సిటీ పరిధిలో 42 వేల మంది విద్యార్థులుండగా.. ఇప్పటి వరకూ 20 వేల మందితో ఖాతాలు తెరిపించారు. త్వరలో మిగిలిన వారితో ఖాతాలను తెరిపించనున్నట్లు ప్రొఫెసర్ కేశవరెడ్డి తెలిపారు.

అన్ని కోర్సులకూ వర్తిస్తుంది



అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్ (ఏబీసీ) అనేది ప్రతి విద్యార్థికీ చాలా కీలకమైన అంశం. కంపెనీల్లో పనిచేస్తూనే ఆన్‌లైన్ ద్వారా కోర్సు పూర్తి చేయవచ్చు. పరిశ్రమల అవసరాలకు తగినట్లుగా ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లోనే నూతన కోర్సులు పూర్తి చేసుకునే వెసులుబాటూ ఉంది. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఏబీసీలో జేఎన్‌టీయూ–అనంతపురం పరిధిలోని ప్రతి విద్యార్థి ఖాతా ఉండేలా చర్యలు తీసుకున్నాం. ఇందుకోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాం.

– ఆచార్య జింకా రంగజనార్దన, వీసీ, జేఎన్‌టీయూ–అనంతపురం

శాంతికి చిహ్నం ఇస్లాం

- అల్లాహ్ మార్గంలోనే మోక్షం
- ప్రత్యేక ప్రార్థనలతో ముగిసిన ఇస్తెమా





ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు – ఇస్తెమా కార్యక్రమానికి హాజరవుతున్న ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, అనంత వెంకట్రామిరెడ్డి, మేయర్ వసీం తదితరులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: హింసకు వ్యతిరేకం ఇస్లామని, ఇతరులను ఇబ్బంది పెట్టడం ఇస్లాం ధర్మం కాదని మౌలానా ఉమర్ సాహెబ్ బోధించారు. అనంత నగర శివారులోని ఆటో నగర్‌లో ఏర్పాటు చేసిన ఇస్తెమా కార్యక్రమం ఆదివారం రాత్రి ముగిసింది. లక్షలాది మంది ముస్లింలు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమర్ సాహెబ్ ఆధ్యాత్మిక ప్రసంగం కొనసాగిస్తూ.. సర్వమానవాళి సుఖ సంతోషాలతో, సౌభాగ్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఇతరుల హక్కులను కాలరాయడం, వారిని హింసించి ఇబ్బందులకు గురి చేయడం ఇస్లాం సహించదని, ఆ దిశగా ప్రతి ఒక్క ముస్లిమూ నడుచుకోవాలని పిలుపునిచ్చారు.

మంచి తనమే ఉన్నతికి కారణం..

మంచితనంతో అల్లా కృప పొందిన ప్రతి ఒక్కరూ ఇహ, పర లోకాల్లో ఉన్నత స్థానంలో ఉంటారన్నారు. అలాంటి వారి కోసం స్వర్గలోక ద్వారాలు తెరిచి ఉంటాయన్నారు. మహమ్మద్ ప్రవక్త పాటించిన నియమాలను వివరిస్తూ... స్వార్థం, నిరాశ, నిస్పృహ, ఇతరుల పట్ల ద్వేషం వీడాలని, సర్వజీవులపై ప్రేమానురాగాలు కలిగి ఉండాలని సూచించారు. జీవితంలో చేసిన పాప, పుణ్యాలే మరణించిన తర్వాత లెక్కించబడతాయన్నారు. జనన, మరణాల్లో ఎలాంటి తారతమ్యాలు లేవనే వాస్తవాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మంచితనమనేది ఇస్లాముకు ప్రతిరూపమని పేర్కొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా నిఖా..

ఇస్తెమాకు హాజరైన లక్షలాది మంది ప్రత్యేక ప్రార్థనల మధ్య 15 జంటలకు అంగరంగ వైభవంగా నిఖా జరిపించారు. చివరగా సర్వమానవాళి శాంతి, ఈ ప్రాంతం సుభిక్షాన్ని ఆకాంక్షిస్తూ ప్రత్యేక దువా ఆచరించారు.

పాల్గొన్న ఎమ్మెల్యేలు, మేయర్ ..

ఆదివారం నిర్వహించిన ఇస్తెమా ప్రత్యేక ప్రార్థనల్లో అనంతపురం, రాప్తాడు ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, నగర మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, ఉర్దూ అకాడమి చైర్మన్ నదీం అహమ్మద్, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఇస్తెమా ప్రాముఖ్యతను మత పెద్దలు, మౌలానాలు వివరించారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు జాయింట్ సెక్రటరీ ఖాజా, కార్పొరేటర్లు ఇషాక్, రహంతుల్లా, బాబాఫక్రుద్దీన్, మునిసిపల్ మాజీ చైర్మన్ నూర్ మహమ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఖాజా, రఫి, జావీద్, నిర్వాహకులు అమీర్‌సాబ్, ఉమ్మడి అనంతపురం, కర్నూలు, కడప జిల్లాలతో పాటు కర్ణాటకలోని బళ్లారి, రాయచూర్, హోస్పేట, బెంగుళూరు, మైసూరు, హుబ్లీ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన లక్షలాదిమంది ముస్లింలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సంతల ద్వారా రూ.3.47 లక్షల ఆదాయం

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన జీవాలు, పశువుల సంతల ద్వారా రూ.3.47 లక్షలకు పైగా ఫీజు వసూలైనట్లు యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ వై.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత నుంచి రూ.1,90,130 కాగా ఆదివారం పశువుల సంత ద్వారా రూ.1.57 లక్షలు మేర ఆదాయం వచ్చిందన్నారు.

'అనంత'లో వివాహ పరిచయ వేదిక

అనంతపురం కల్చరల్: వివాహ పరిచయ వేదికలు వధూవరులు, తల్లిదండ్రులకు ఎంతో ఉపయోగకరమని ఏపీబీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రామరాజు అన్నారు. ఆదివారం తిరుపతి వేదికగా రాష్ట్ర స్థాయి బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. జిల్లా తరఫున పాల్గొన్న ప్రతినిధులకు రాష్ట్ర కమిటీలో ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. 'అనంత'లోనూ అందరికీ అందుబాటులో ఉండేలా వివాహ పరిచయ వేదికలు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా వారిని సత్కరించి, జ్ఞాపికలు అందించారు.

విద్యారణ్య పీఠం అధ్యక్షుడిగా నరసింహులు


విద్యారణ్య పీఠం నూతన కమిటీ సభ్యులు

రాప్తాడురూరల్: నగరంలోని విద్యారణ్య విద్యాపీఠం అధ్యక్షుడిగా మరోసారి గోపామచ్చా నరసింహులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం విద్యారణ్య విద్యాపీఠం ప్రాంగణంలో నూతన కమిటీ ఎంపిక జరిగింది. మూడేళ్ల పాటు కొనసాగే పాత కమిటీ సభ్యులను మరోసారి ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో పాత కమిటీనే కొనసాగించాలని సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. అధ్యక్షుడిగా నరసింహులు, ఉపాధ్యక్షుడిగా ఎస్ఎస్ రంగయ్య, సెక్రటరీగా పరుచూరి రమేష్ బాబు, కరస్పాండెంట్‌గా సుంకు వేణుగోపాల్, కోశాధికారిగా రాచర్ల చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గోపా మచ్చా నరసింహులు మాట్లాడుతూ నైతిక విలువలు, దేశభక్తి విద్యార్థుల్లో పెంపొందించడానికి విద్యారణ్య పీఠం ఏర్పడిందన్నారు. అదే స్థాయిలోనే విలువలు పాటిస్తామన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ సహకారంతో విద్యారణ్య పాఠశాలను అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను సన్మానించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


అక్కమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

రాప్తాడు: మండలంలోని లింగనపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కూసం బయప రెడ్డి భార్య కూసం అక్కమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి లింగనపల్లికి వెళ్లి కూసం అక్కమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

బసాపురం ఆంజనేయుడికి విశేష పూజలు


కూడేరు: అలంకరణలో ఆంజనేయుడు

కూడేరు: మండలంలోని బసాపురం ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టువస్త్రాలు, పుష్పాలతో అర్చకులు మూలవిరాట్‌ను అలంకరించి ఆకు పూజ కట్టారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

విద్యతోనే ఉత్తమ జీవితం

రాయదుర్గంటౌన్: అల్లా విధేయులుగా ప్రవక్త చూపిన మార్గంలో నడిస్తేనే మనిషి జీవితానికి సార్థకత లభిస్తుందని, ప్రధానంగా విద్యతోనే ఉత్తమ జీవితం చేకూరుతుందని మౌలానాలు బదియుజ్జమ మదని, సయ్యద్ వాజిద్ హసన్ మదని, షాఫిక్ అలాంఖాన్ అన్నారు. పట్టణంలోని మహమ్మద్ అరబిక్ కళాశాల 97వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమాభివృద్ధి


జెండా ఎగరవేస్తున్న ఎమ్మెల్యే అనంత, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, నాయకులు


క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమాదేవి


ఆత్మకూరులో పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- నగరంలో ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

అనంతపురం క్రైం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టి, ప్రజల ఇళ్ల ముంగిటకే పాలన తెచ్చారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. వైఎస్సార్ ఆశయాలకనుగుణంగా ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థతో గాంధీ కలలను సార్థకం చేసిన గొప్ప వ్యక్తి జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ అధ్యక్షుడు పైలా నరసింహయ్య జెండాను ఆవిష్కరించారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్యతో కలిసి ఎమ్మెల్యే అనంత కేక్ కట్ చేశారు.

పాలనలో విప్లవాత్మక మార్పులు

వైఎస్సార్ స్ఫూర్తితో జగన్‌మోహన్ రెడ్డి పార్టీని స్థాపించారని ఎమ్మెల్యే అన్నారు. పార్టీ ఏర్పాటై 12 ఏళ్లు పూర్తి చేసుకొని 13వ వసంతంలోకి అడుగు పెట్టిందన్నారు. అధికారంలోకొచ్చిన తర్వాత కేవలం మూడున్నరేళ్లలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి, దేశంలోనే ఆదర్శ పాలన అందిస్తున్నారన్నారు. గతంలో వైఎస్సార్ అర్హతే ప్రామాణికంగా సంక్షేమాన్ని అందిస్తామని చెప్తే ప్రతిపక్షాలు అపహాస్యం చేశాయన్నారు. కానీ అది నిరూపించిన వ్యక్తి వైఎస్సార్ అని కొనియాడారు. విద్య, వైద్యం, ఇతర రంగాల్లో సమూల మార్పులు తీసుకొచ్చారన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా, ప్రజలు, దేవుడిని నమ్ముకొని ధైర్యంగా ముందుకెళ్తూ ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్నట్లు తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనేక సవాళ్లను ఎదుర్కొని, వెన్నుచూపకుండా బలమైన పార్టీగా వైఎస్సార్ సీపీని నిలిపారన్నారు. సీఎంగా బాధ్యతలు తీసుకున్న అనతి కాలంలోనే ఎన్నో విప్లవాత్మక మార్పులతో ప్రజలకు సంక్షేమం అందించారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అన్ని విధాలా న్యాయం చేసిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహ్మద్, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, బీసీ కమిషన్ సభ్యులు, విశ్రాంత జడ్జి కిష్టప్ప, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, అనిల్‌కుమార్‌రెడ్డి, రహంతుల్లా, శేఖర్‌బాబు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులు శ్రీదేవి, సైఫుల్లాబేగ్, ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, ఎగ్గుల శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ నాయకులు పామిడి వీరాంజనేయులు, ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, నాయకులు ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, అనిల్ కుమార్ గౌడ్, ఉమాపతి, మారుతీనాయుడు, నిమ్మల నాగరాజు, శ్రీనివాసులు, నవీన్‌కుమార్, జావెద్, ఓబులేసు, కొండమ్మ పరమేశ, మునీరబేగం, భారతి, ఉషారాణి, ఉషాబాయి, గౌరి, రాధా యాదవ్, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

సంస్థ చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో..

ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించి గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమాదేవి ఆమె క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎల్‌ఎం మోహన్‌రెడ్డి, నాయకులు నారాయణరెడ్డి, గంగాధర్, కిష్ట, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం జరిగింది. కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, బాలపోతన్న, వెంకట్రాముడు, నరసింహారెడ్డి, వెంకటేష్, గూలి కొండారెడ్డి, ఫణిరెడ్డి, అతికిరెడ్డి, గోపాల్‌రెడ్డి, కేశవనాయక్, ఓబులేష్, విజయ్‌కుమార్, ఈశ్వర రెడ్డి, అంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

- ఏపీ నాటక అకాడమీ చైర్‌పర్సన్ హరిత

అనంతపురం కల్చరల్: వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కళాకారులను ఏపీ నాటక అకాడమీ చైర్‌పర్సన్ రాగే హరిత కోరారు. ఆదివారం ఆమె పట్టభద్రుల, ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న కళాకారులు ఓ ప్రకటనలో కోరారు. మైనార్టీ, బడుగు బలహీన వర్గాలకే కాదు..అన్ని వర్గాల సంక్షేమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాంక్షిస్తున్నారన్నారు.

ఆకస్మిక తనిఖీలు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరంలోని త్రీటౌన్ పోలీసులు పలు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీలు చేశారు. లాడ్జీలు, హోటళ్లు, అనుమానిత ప్రాంతాల్లో సోదాలు చేశారు. అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించారు. లాడ్జిల్లో అనుమానితులను విచారించి, వివరాలు సేకరించారు. జిల్లాలో సోమవారం జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఎస్పీ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించినట్లు త్రీటౌన్ సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు.

ఘనంగా ఆరాధనోత్సవం

పామిడి: స్థానిక సీఎస్ఐ చర్చిలో ఆదివారం ఆరాధనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చర్చి సెక్రటరీ పరదేశి విజయశేఖర్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో దైవసేవకుడు బ్రదర్ బాబావలి ప్రసంగించారు. యెహోవా దేవుడు మానవులను పాప విముక్తి గావించడానికి యేసుక్రీస్తు ఈ లోకానికి వచ్చాడన్నారు. ఆయన అంతులేని సిలువ ప్రాణ త్యాగంతో పాపముక్తి లభించిందన్నారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు, వీరయ్య, జయరాజు, అబ్రహాం, బుజ్జిబాబు, కిష్టఫర్ బాబు, రవిరాజు, అరుణ్, ప్రసాద్, విజయభాస్కర్, రూఫస్, రూతు, మేరి, రజని, అనూష పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరా.. నమోనమః


స్వామి మూలవిరాట్‌కు హారతి ఇస్తున్న అర్చకులు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. సుబ్రహ్మణ్యేశ్వరా.. నమోనమః అంటూ భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. మొదటగా స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ఆలయ ప్రాంగణంలో రాహుకేతు హోమాలు చేశారు. ఆలయంలోని మంజునాథస్వామి, పార్వతిదేవికి ప్రత్యేకంగా అభిషేకాలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు.

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచేగాక జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శనం చేసుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఇలా చేయడం వల్ల కోర్కెలు తీరుతాయని ప్రజల నమ్మకం. స్వామి మూలవిరాట్ అడుగున ఉన్న నీటిని భక్తులు బాటిళ్లలో తీసు కెళ్లారు.

నేటి నుంచి 'హజ్రత్ సయ్యద్' ఉరుసు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కొండపై వెలసిన హజ్రత్ సయ్యద్ జాఫర్ షా వలి 305వ ఉరుసును సోమ, మంగళవారం రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం గంధం (సందల్) ఉత్సవం నిర్వహించనున్నట్లు దర్గా నిర్వాహకులు మంజూర్‌ఖాద్రి, పీరా, రియాజ్, రఫీక్, సర్మాస్, నిజాముద్దీన్ తెలిపారు. మంగళవారం జియారత్ కార్యక్రమంతో ఉరుసు ముగుస్తుందన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి


రాప్తాడులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ మోహన్, ఎస్ఐలు ఆంజనేయులు, శ్రీకాంత్


రాప్తాడులో పోలింగ్ కేంద్రంలో సామగ్రిని సరిచూసుకుంటున్న సిబ్బంది


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, పీఆర్ జేఈ

రాప్తాడు: నియోజకవర్గ పరిధిలో సోమవారం జరగనున్న రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రాప్తాడు నియోజకవర్గంలో రాప్తాడు, అనంతపురం రూరల్, ఆత్మకూరు, కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాలు ఉన్నాయి. వీటిలో 9,289 మంది పట్టభద్రులు, 440 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. నియోజకవర్గంలో మొత్తం ఆరు మండలాల్లో 6 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది నియామకం:

రాప్తాడు నియోజకవర్గంలో ఆరు మండలాల్లో పోలింగ్ సిబ్బందిని నియమించారు. వారిలో ఒక పోలింగ్ కేంద్రానికి 1 పీఓ, ముగ్గురు ఏపీఓలు, ఇద్దరు ఓపీఓలు, సూక్ష్మ పరిశీలకులు ఒకరు, వెబ్ క్యాస్టింగ్ ఒకరు, 1 వీడియో గ్రాఫర్, మైక్రో అబ్జర్వర్, బీఎల్‌ఓతో కలిసి ఒక్కో మండలానికి 20 మంది సిబ్బంది పని చేయనున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎన్నికల విధుల కోసం మొబైల్ పార్టీలు, స్ట్రైకింగ్ పార్టీ (ప్రతి మండలానికి ఒకటి చొప్పున), స్ట్రైకింగ్ ఫోర్స్ నియోజకవర్గానికి ఒకటి, ఎంసీసీ బృందాలు, క్యూర్టీ పార్టీలు నియమించారు. మొత్తంగా డీఎస్పీ, సీఐ, ఎస్ఐ, ఏఎస్ఐ కేడర్‌తో సహా మొత్తం పోలీసు సిబ్బంది సుమారు 200 మందికి పైగా విధుల్లో పాల్గొననున్నారు. ఇటుకల పల్లి సీఐ మోహన్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆరు మండలాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. పోలింగ్ ముగిసే వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు చేపట్టామన్నారు. రాప్తాడు తహసీల్దార్ లక్ష్మీనరసింహులు మాట్లాడుతూ పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

ఆత్మకూరు: మండలం కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జెడ్పీహెచ్ఎస్‌లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ సత్యబాబు ఆదివారం తెలిపారు. మండల వ్యాప్తంగా ఉపాధ్యాయులు 44 మంది ఓటర్లు, పట్టభద్రులు 1,070 మంది ఉన్నట్లు తెలిపారు. ఎస్ఐ రంగ యాదవ్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆకుతోటపల్లి పోలింగ్ కేంద్రం సిద్ధం

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లి ప్రాథమిక పాఠశాలలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన 121–సీ పోలింగ్ స్టేషన్‌లో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఎంపీడీఓ బాబాఫక్రుద్దీన్, పంచాయతీరాజ్ జేఈ శ్రీనివాసరెడ్డి ఆదివారం ఏర్పాట్లను పర్యవేక్షించారు. పోలింగ్ స్టేషన్ పరిధిలో 1,266 ఓట్లు ఉన్నాయి. సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. బారికేడ్లు, మెడికల్ కిట్, తదితర ఏర్పాట్లను పరిశీలించారు. ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని ఎంపీడీఓ, పీఆర్ జేఈ తెలిపారు. ఎస్కేయూతో పాటు కందుకూరు, జంగాలపల్లి, చియ్యేడు, పూలకుంట, ఉప్పరపల్లి, కృష్ణంరెడ్డిపల్లి తదితర గ్రామాల ఓటర్లకు ఈ పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

హనుమద్ వాహనంపై శ్రీవారు


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరుడు

యల్లనూరు: మండల కేంద్రంలోని లక్ష్మీ వేంకటరమణస్వామి ఆలయంలో ఆదివారం హనుమద్ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రధాన అర్చకుడు విజయ్ ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామికి పూజలు, అర్చనలు అభిషేకాలను నిర్వహించారు. సాయంత్రం హనుమద్ వాహనంపై స్వామి ఉత్సవిగ్రహాన్ని ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. ఉత్సవాలను ఈఓ శోభారాణి పర్యవేక్షించారు.

చేనేత హస్తకళలను ప్రోత్సహించాలి


చేనేత ప్రదర్శనను ప్రారంభిస్తున్న కోగటం విజయభాస్కరరెడ్డి

అనంతపురం కల్చరల్/అనంతపురం క్రైం: భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టే చేనేత, హస్తకళలను ప్రోత్సహించాలని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన జాతీయ చేనేత సిల్క్ ఎక్స్‌పోను ఆయన ప్రారంభించారు. అరంతరం ఆయన మాట్లాడుతూ చేనేత కళాకారులను ప్రభుత్వం ఆదరిస్తోందని, వారి ప్రతిభను గుర్తించి ప్రత్యేక పథకాలను అమలు చేస్తోందన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ మరో 20 రోజుల పాటు కల్యాణ మండటపం ప్రాంగణంలో చేనేత, హస్తకళల ప్రదర్శన ఉంటుందన్నారు. కార్యక్రమంలో కోటా దేవకీ దేవి, మహేష్, రాయల్ వాసు, రామమోహన రెడ్డి, నరేష్‌రెడ్డి, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇస్తెమా

అనంత నగర శివారులోని ఆటోనగర్‌లో ఏర్పాటు చేసిన ఇస్తెమా కార్యక్రమం ఆదివారం రాత్రి ముగిసింది. ఈ సందర్భంగా లక్షలాది మంది ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు, అల్లాహ్ బోధనలను వినేందుకు తరలివచ్చారు. నిర్వాహకులు ఇస్తెమాకు వసతుల కల్పనపై ముస్లింలు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఇస్తెమా నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఇస్తెమా ముగిసిన తర్వాత దూర ప్రాంతాల నుంచి వచ్చిన ముస్లింలు తరలివెళ్లారు. ఇస్తెమా విజయవంతంగా ముగియడంపై అనంతపురం, రాప్తాడు ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, నగర మేయర్ వసీం తదితర ప్రజాప్రతినిధులు నిర్వాహకులకు ప్రత్యేంగా అభినందనలు తెలియజేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:


ఇస్తెమాలో భోజనాలు చేస్తున్న ముస్లింలు


ప్రత్యేక స్థలంలో నిలిపిన వేలాది వాహనాలు


ముస్లిం నాయకులతో ఎమ్మెల్యే అనంత, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి


పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలు

ఒకరికి తీవ్ర గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని జడ్.వీరారెడ్డి కాలనీసమీపంలో ఆదివారం బైక్‌పై నుంచి కింద పడి ఓవ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. పుప్పాల తండాకు చెందిన రమేష్ నాయ పని మీద గుత్తికి వచ్చాడు. పని ముగించుకుని బైక్‌పై స్వగ్రామానికి బయల్దేరాడు. జడ్ వీరారెడ్డి కాలనీవద్ద బైక్‌పై నుంచి కిందపడ్డాడు.

ప్రయాణికుడికి గాయాలు

గుత్తి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం పెచ్చులూడి మీద పడటంతో బొమ్మిరెడ్డి అనే ప్రయాణికుడు గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే.. యాడికి మండలం కేశవరాయుని పేటకు చెందిన బొమ్మిరెడ్డి బస్సులో పని మీద గుత్తికి వచ్చాడు. బస్టాండ్‌లో దిగి టాయిలెట్ కోసం మరుగు దొడ్డి వైపు వెళుతున్న సమయంలో బస్టాండ్ పై కప్పు పెచ్చులూడి మీద పడ్డాయి . గాయపడిన అతడిని స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.